ఆరునెలలుగా మంత్రి లేకుండానే పాలన


మంత్రివర్గ విస్తరణలో చోటుపై గంపెడాశలు

ఆశావహుల్లో సుదర్శన్ రెడ్డి, మహేశ్ గౌడ్, షబ్బీర్

రేవంత్ రెడ్డి సర్కారులో ఉమ్మడి జిల్లాపై నిర్లక్ష్యం

అన్నింటికీ ఇన్‌చార్జి మంత్రి సారథ్యం

# ఉమ్మడి జిల్లాకు దిక్కెవరు?









నిజామాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వంలో పెద్దదిక్కు కరువైంది. కీలకమైన మంత్రి పదవి ఈ ప్రాంతానికి ఇవ్వకపోవడంతో సర్కారులో ప్రాధాన్యత కరువైంది. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సారథ్యంలోనే అన్ని వ్యవహారాలు నడుస్తున్నప్పటికీ జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలకు అమాత్యయోగం ఎప్పుడు వస్తుందోనని అంతా ఎదురు చూస్తున్నారు. మరోవైపు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పరిపాలనను ముందుకు నడిపించేందుకు కీలకమైన మంత్రి ఒకరు కచ్చితంగా ఉండాల్సిందే. రేవంత్ సర్కారు కొలువుదీరి ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఇంత వరకూ భర్తీ ప్రక్రియ జరుగలేదు. మంత్రి వర్గ విస్తరణపై చాలా మంది ఆశావహులు ఎదురుచూస్తుండగా ఏఐసీసీ, పీసీసీ నాయకత్వం తాత్సారంతో వాయిదా పడుతూ వస్తున్నది. ఉత్తర తెలంగాణలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కీలకమైన భాగస్వామి. వ్యాపార, వాణిజ్య, వ్యవసాయపరంగా ఎంతో ప్రాముఖ్యమైంది. ఇంతటి ఘన కీర్తిని కలిగిన ఈ జిల్లా నుంచి మంత్రివర్గంలో ఎవ్వరికీ చోటు దక్కకపోవడంపై ప్రజల్లో ఒక రకమైన అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఖమ్మం లాంటి జిల్లాకు మూడేసి మంత్రి పదవులు ఇచ్చి ఉమ్మడి జిల్లాకు మొండి చేయి చూపడంలో ఆంతర్యం ఏమిటంటూ జనాలు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ హయాంలో ఏనాడూ ఉమ్మడి జిల్లా నిర్లక్ష్యానికి గురి కాలేదు.

### రెడ్డి వర్సెస్ బీసీ వర్సెస్ మైనార్టీ..

ఓ వైపు సుదర్శన్ రెడ్డి పేరు దాదాపుగా ఖరారైందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తున్న దరిమిలా తెరపైకి కొత్తగా మరికొంత మంది పేర్లు కూడా వినిపిస్తుండడం ఆసక్తి నెలకొన్నది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, పీసీసీ ముఖ్య నాయకుడు షబ్బీర్ అలీ పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్లుగా జోరుగా చర్చ జరుగుతున్నది. అవసరమైతే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరికీ మంత్రి పదవి దక్కే వీలున్నట్లుగా పలువురు కాంగ్రెస్ నాయకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఎవరెవరికి మంత్రి పదవి దక్కుతుందోనన్న ఆసక్తి హస్తం నేతల్లో కనిపిస్తున్నది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసిన వారిలో షబ్బీర్ అలీ మినహాయిస్తే అంతా అగ్రవర్ణాలకు చెందిన వారే ఉన్నారు. బీసీలకు తీవ్రంగా అన్యాయం జరిగింది. చట్టసభల్లో బీసీలకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రాధాన్యమే దక్కలేదు. మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చినప్పటికీ ప్రత్యక్ష ఎన్నికల్లో చాలా మంది టికెట్ ఆశించగా భంగపాటుకు గురయ్యారు. ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పెద్దపీట దక్కుతుందా? లేదంటే అగ్రవర్ణాలకు చోటు కల్పిస్తారా? అన్నది ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రేవంత్ క్యాబినెట్‌లో మైనార్టీ లీడర్లకు చోటు లేకుండా పోయింది. షబ్బీర్ అలీ పోటీ చేసి ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో ఆ వర్గానికి స్థానమే కరువైంది. ఈ నేపథ్యంలో మైనార్టీ కోటాలో షబ్బీర్‌కు అమాత్యయోగం వరిస్తుందా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో తాజా రాజకీయాన్ని పరిశీలిస్తే రెడ్డి వర్సెస్ బీసీ వర్సెస్ మైనార్టీ అన్నట్లుగా తయారైంది. సుదర్శన్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీల్లో ఎవరికి అమాత్యయోగం దక్కాల్సి ఉందో కాలమే నిర్ణయించాల్సి ఉంది.

### ఉమ్మడి జిల్లాపై నిర్లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలో మొత్తం తొమ్మిది అసెంబ్లీ స్థానాలుంటే కామారెడ్డిలో రెండు చోట్ల, నిజామాబాద్‌లో రెండుచోట్ల హస్తం పార్టీ గెలిచింది. ఇందులో సీనియర్ ఎమ్మెల్యేగా సుదర్శన్ రెడ్డి ఒక్కరే ఉన్నారు. పీసీసీ ముఖ్య నాయకుడిగా షబ్బీర్ అలీ ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమి చవిచూశారు. అనంతరం ఆయనకు క్యాబినెట్ ర్యాంకుతో సమానమైన ప్రభుత్వ సలహాదారు పదవి దక్కినప్పటికీ మంత్రి పదవికి ఉండే హోదా, దర్పం అందులో కనిపించకపోవడంతో లోటు కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వం కుదురుకున్న సమయంలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో క్యాబినెట్ కూర్పు వాయిదా పడింది. మంత్రివర్గ విస్తరణలో మొదట్నుంచి ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికే చోటు దక్కుతుందని చర్చ నడుస్తున్నది. ఉభయ జిల్లాల్లో గెలిచిన ఎమ్మెల్యేల్లో ముగ్గురూ కొత్తవారే ఉన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మొదటిసారి గెలిచారు. వీరితో పోలిస్తే సుదర్శన్ రెడ్డికి సీనియారిటీ కలిసి వస్తుంది. రేవంత్ మంత్రివర్గంలో హోంశాఖను ఎవ్వరికీ కేటాయించకపోగా సీఎం వద్దే ఉన్నది. కీలకమైన పోలీస్ శాఖను సుదర్శన్ రెడ్డికే కేటాయించబోతున్నట్లుగా ఈ ఏడాది ప్రారంభం నుంచే ప్రచారం నడుస్తున్నప్పటికీ ఇంత వరకూ రేవంత్ క్యాబినెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత లేకుండా పోయింది.

---

పేద విద్యార్థులకు వరం.. గురుకుల పాఠశాలలు

సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తి చేయడమే నా సంకల్పం

గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పోచారం

# పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్య అవసరం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, జూన్ 8: ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశారని, రాష్ట్రంలో 230 ఉన్న గురుకుల పాఠశాలలను 1120కి పెంచిన ఘనత ఆయనకే దక్కిందని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో రూ.12 కోట్లతో నిర్మించే గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ప్రపంచం చాలా వేగంగా పరుగెడుతుందని, పరిగెత్తే ప్రపంచాన్ని అందుకోవాలంటే నాణ్యమైన విద్య చాలా అవసమరని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో పనిచేశానని అన్నారు. కేసీఆర్ కృషితో కోనాపూర్–హన్మాజీపేట్ గ్రామాల మధ్య గిరిజన గురుకుల పాఠశాల మంజూరైందని తెలిపారు. గత సంవత్సరం 11మందితో ప్రారంభమైన పాఠశాల నేడు 350మంది విద్యార్థులతో కొనసాగుతున్నదన్నారు. విద్యార్థినులకు శాశ్వత భవనం నిర్మాణం కోసం రూ.12 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

**రిజర్వాయర్ పనులు పూర్తి చేయడమే లక్ష్యం..**

గట్టుమీది గ్రామాలైన హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్, కాద్లాపూర్ తదితర గ్రామాలకు సాగునీరు అందించేందుకు రూ.200కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు చేపట్టామన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రిజర్వాయర్ పనులు పూర్తి చేయడమే తన సంకల్పమని అన్నారు. పనులు సజావుగా నడిచేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మనీషా, వర్ని జడ్పీటీసీ హరిదాస్, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్, ఎంపీడీవో బషీరొద్దీన్, ఎంపీటీసీలు జెట్టి హన్మాండ్లు, సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

### మీ వల్లే జవాన్ అయ్యా సార్..

సార్ మీ కృషి, మీ కుమారుడు పోచారం భాస్కర్‌రెడ్డి సహకారంతో ఆర్మీ జవాన్ ఉద్యోగం సాధించానని ఓ యువకుడు ఆనందం వ్యక్తం చేశారు. సంగోజీపేట్ గ్రామానికి చెందిన రాసాలం మహేశ్.. ఆర్మీ జవాన్‌గా ఎంపికయ్యాడు. కోనాపూర్‌కు వచ్చిన పోచారంను మహేశ్ ఘనంగా సత్కరించారు. నిరుద్యోగుల కోసం బాన్సువాడలో పీబీఆర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇవ్వడం వల్లే తాను భారత ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించానని చెప్పాడు. దేశానికి సేవ చేసే గొప్ప ఉద్యోగం సాధించావని ఎమ్మెల్యే పోచారం అతడ్ని అభినందించారు.



మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డితో ఆర్మీ జవాన్ మహేశ్

---

# జాతీయ లోక్‌అదాలత్‌లో 16వేల కేసుల రాజీ

జిల్లా జడ్జి సమక్షంలో రూ.6కోట్ల పరిహారం.. గెజిట్ విడుదల




లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, జూన్ 8: నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 16వేల కేసులు పరిష్కారమయ్యాయి. అదనపు జిల్లా కోర్టులో న్యాయ విచారణలో ఉన్న భూనష్ట పరిహారం సివిల్ దావాలో ఇరుపక్షాల రాజీ మేరకు రూ.6 కోట్ల 11 లక్షల15వేల111 పరిహారానికి సంబంధించి అవార్డును జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల సమక్షంలో జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని నారాయణ రావుకు చెందిన ఏడు ఎకరాల వ్యవసాయ భూమిని బలహీన వర్గాల ఇంటి నిర్మాణం కోసం 1984లో అప్పటి కలెక్టర్ తరపున నిజామాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి గెజిట్‌ను విడుదల చేశారు. భూ యజమాని నారాయణ రావు భూనష్ట పరిహారం చెల్లించాలని నిజామాబాద్ అదనపు జిల్లా కోర్టులో 2008లో పది కోట్లకు దావా దాఖలు చేశారు. ఇరుపక్షాలతో సంప్రదింపులు జరిపిన జిల్లా జడ్జి సునీత కుంచాల, అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ రాజీ పరిష్కారంగా రూ.6కోట్ల11 లక్షల12 వేల111కు ఒప్పించారు. ఈ మేరకు లోక్‌అదాలత్‌లో అవార్డును అందజేసి బ్యాంకు చెక్కును భూనష్టపరిహారదారు నారాయణరావుకు జిల్లా జడ్జి సునీత కుంచాల, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పద్మావతి, ప్రభుత్వ న్యాయవాది శ్రీహరి ఆచార్య, సంస్థ సూపరింటెండెంట్ పురుశోత్తం గౌడ్ పాల్గొన్నారు.

**కామారెడ్డిలో 3,819 కేసుల పరిష్కారం**

కామారెడ్డి, జూన్ 8: చట్టాలపై ప్రజలందరికీ అవగాహన ఉండాలని, కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవాలని కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి అన్నారు. జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ దావాలు , రాజీపడదగిన క్రిమినల్ కేసులు ఇరుపక్షాల ఆమోదంతో రాజీ పద్ధతిలో పరిష్కారానికి చట్టంలో అనుమతులు ఉన్నాయని వివరించారు. రెగ్యులర్ కోర్టుకు రాని కేసులు కూడా పరిష్కరించనున్నట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లో 3819 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్, శ్రీనివాస్ నాయక్, సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దీక్ష, పీపీ రాజగోపాల్ గౌడ్, అశోక్, శివరాం, నిమ్మ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# సీఎంసీ సమీపంలో యువకుడి హత్య

- పోలీసుల అదుపులో నిందితుడు
- అతడి ఇంటికి నిప్పంటించిన మృతుడి కుటుంబీకులు
- డిచ్‌పల్లి పీఎస్ ఎదుట ఆందోళన



మెగ్యానాయక్ తండాలోని నిందితుడి ఇంటి వద్ద మోహరించిన పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది

ఇందల్వాయి, జూన్ 8: డిచ్‌పల్లి మండలం సీఎంసీ సమీపంలో ఓ యువకుడు హత్యకు గురవడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. సదరు నిందితుడి ఇంటికి మృతుడి కుటుంబీకులు, బంధువులు నిప్పటించారు. ఈ ఘటన ఇందల్వాయి మండలం మెగ్యానాయక్ తండాలో శనివారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు.. మెగ్యానాయక్ తండాకు చెందిన లకావత్ వెంగల్ (36) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు అదే రోజు సాయంత్రం ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి డిచ్‌పల్లి సీఎంసీ సమీపంలోని చెట్ల పొదల్లో వెంగల్ మృతదేహం లభించింది. అదే తండాకు చెందిన బిక్యాతో కలిసి వెంగల్ సీఎంసీ సమీపంలో మద్యం తాగాడు. మద్యం మత్తులో వెంగల్‌ను బిక్యా హత్య చేసి ఉంటాడని పోలీసులు భావించి అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు, కుటుంబీకులు శనివారం ఉదయం బిక్యా ఇంటిపై దాడి చేసి నిప్పంటించారు. అనంతరం మృతుడి కుటుంబీకులు బంధువులు, తండావాసులు పెద్దసంఖ్యలో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి మూడు గంటల పాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయబాబు డిచ్‌పల్లి ఠాణాకు చేరుకొని తండాపెద్దలతో మాట్లాడారు. కుటుంబీకులు, బంధువులను సముదాయించారు. హత్య చేసిన నిందితులను పట్టుకుని, చట్టప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



బాధితులు నిందితుడి ఇంటికి నిప్పుపెట్టడంతో కాలిపోయిన వస్తువులు

---




### ముసుగు తొలగింది

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు అనే శీర్షికపై నమస్తే తెలంగాణ దినపత్రికలో శనివారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు చౌరస్తాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు పార్లమెంటు ఎన్నికల సందర్భంగా వేసిన ముసుగులను శనివారం తొలగించారు.

–కామారెడ్డి, జూన్ 8



కామారెడ్డిలోని సెంటర్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

# నేడే గ్రూప్-1 ప్రిలిమ్స్

- నిజామాబాద్‌లో 41, కామారెడ్డిలో 12 పరీక్షా కేంద్రాలు
- అరగంట ముందే చేరుకోవాలి : అధికారుల సూచన

ఖలీల్‌వాడి/కామారెడ్డి, జూన్ 8: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష కొనసాగనున్నది. అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, అధికారులు స్పష్టం చేశారు. హాల్‌టికెట్‌పై ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను కచ్చితంగా అతికించి తీసుకురావాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 41కేంద్రాలు ఏర్పాటు చేశామని, 12,833 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, 160 మంది అభ్యర్థులకు ఒక బయోమెట్రిక్ యంత్రాన్ని అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

**కామారెడ్డిలో 12 సెంటర్లు..**

కామారెడ్డిలో గ్రూప్–1ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. జిల్లాలో 4797 మంది అభ్యర్థులు 12 కేంద్రాల్లో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష పర్యవేక్షణకు ముగ్గురు రూట్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, అబ్జర్వర్లను నియమించినట్లు పేర్కొన్నారు.

# చేపమందు కోసం వెళ్లి మృత్యువాత

సిరికొండ, జూన్ 8: నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని తాళ్లరామడుగు గ్రామానికి చెందిన మామిడి గొల్ల రాజన్న (57) చేపమందు కోసం వెళ్లి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధి కోసం గతంలో విదేశాలకు వెళ్లిన ఆయన తిరిగి వచ్చిన తర్వాత వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగేండ్లుగా ఆయన ఆస్తమాతో బాధపడుతున్నారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేపమందు పంపిణీ కార్యక్రమానికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. ఉదయం 7గంటల సమయంలో క్యూలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో రాజన్న తీవ్రం గా గాయపడడంతో కుటుంబ సభ్యులు అతన్ని సమీప దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య చిన్న సాయమ్మ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. రాజన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



రాజన్న (ఫైల్‌ఫొటో)